
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 29 జనవరి 2025





ఒకటో డివిజన్ నుంచి వెళ్లే డ్రెయిన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ బాపిరాజు. చిత్రంలో (వరుసగా) టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచె నాని, 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జి ఏ.ఉమామహేశ్వరరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, తహసీల్దార్ నాగభూషణం, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, జనసేన నేత వంపుగెడల చౌదరి

సమస్యలపై గళమెత్తిన జనం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు

మచిలీపట్నం 1వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన స్థానికులు

- అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలు సమస్యలు
- పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ

మచిలీపట్నంటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లోని మునిసిపల్ పార్కులో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో స్థానిక సమస్యలపై జనం గళమెత్తారు. డ్రెయిన్‌లు సక్రమంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు చేరుతోందని తెలిపారు. డ్రెయిన్‌ల లింక్‌లు సక్రమంగా కలపాలని కోరారు. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణం నరకంగా మారిందన్నారు. పీకేఎం కాలనీలో తాగునీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. మచిలీపట్నం- విజయవాడ మధ్య తిరిగే బస్సులను బైపాస్ రహదారి వెంబడి నడపాలని, తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని, మునిసిపల్ పార్కును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో కోతుల బెడదను నివారించేందుకు



చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సదస్సు దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ



'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి హాజరైన స్థానికులు

మచిలీపట్నం బైపాస్ వెంబడి బస్సులను నడుపుతామన్నారు. రెవెన్యూశాఖ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ నాగభూషణం కోరారు. కాలనీలో ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీస్ బీట్‌ను పెంచుతామని చిలకలపూడి సీఐ నబీ హామీ ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జి ఎ.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, బత్తిన దాసు, కుంచే నాని, అక్కుమహంతి రాజా, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, వైసీపీ కార్పొరేటర్ జోగి చిరంజీవి, మాజీ కౌన్సిలర్ బత్తిన వాసు, టీడీపీ ఫ్లోర్ లీడర్ మరకాని సమతాకీర్తి, టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్, జనసేన నాయకుడు వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

4లో

డ్రైనేజీ సమస్యలపై కలెక్టర్ అధ్యయనం

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' 1వ డివిజన్‌లోని ప్రజా సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలపై కలెక్టర్ డి.కె.బాలాజీ స్పందించారు. మంగళవారం 1వ డివిజన్‌లోని డ్రెయిన్లను ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లు, శిథిలమైన కల్వర్టులపై ఆరా తీశారు. పారిశుధ్య సమస్యపై మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో చర్చించారు. పార్కుల అభివృద్ధిపై ఆరా తీశారు. గతంలో మురుగు పోయేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు డివిజన్‌లోని సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కోతుల బెడద నివారణకు కొండముచ్చును తెప్పించాలని కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. పేదల ఇళ్లస్థలాలకు కావలసిన భూములపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించారు.

డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి



డ్రైవర్స్ కాలనీలో మేము ఉండే ప్రాంతంలో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. మురుగు పారడం లేదు. వర్షం వస్తే రోడ్లు మునిగిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

-లలిత, డ్రైవర్స్ కాలనీ

సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నం 1వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. రోడ్లు, డ్రెయిన్లకు మరమ్మతులు, కుక్కలు, కోతుల బెడదను నిర్మూలిస్తాం. పార్కుల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం. డ్రెయిన్లలో సిల్టు తీసే పని ప్రారంభించాం. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఈ ప్రాంతాన్ని మంగళవారం సందర్శించిన కలెక్టర్ పారిశుధ్యం లోపం లేకుండా ఉండాలని పలు సూచనలు చేశారు. వాటిని అమలు చేస్తాం. మునిసిపల్ అధికారులకు ప్రజలు సహకరించాలి. అలా సహకరిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలవుతుంది.

- బాపిరాజు, మునిసిపల్ కమిషనర్

పదేళ్ల తర్వాత అనూహ్యంగా..

ఎస్తేర్ అనూహ్యా హత్య కేసులో నిందితుడిని నిర్దోషిగా విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు

- నిందితుడిపై ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు చూపలేదని వ్యాఖ్య
- దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్న మచిలీపట్నం వాసులు

మచిలీపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నానికి చెందిన శింగవరపు ఎస్తేర్ అనూహ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా విడుదల చేస్తూ మంగళవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మచిలీపట్నం వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాసిక్యూషన్ ఈ కేసులో నిందితుడిపై సరైన సాక్ష్యాధారాలు చూపలేదనే కారణంతో అతనిని నిర్దోషిగా తేల్చడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మచిలీపట్నం నోబుల్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్తేర్ అనూహ్య ముంబైలోని టీసీఎస్ కంపెనీలో సాఫ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. 2014 డిసెంబరులో క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆమె మచిలీపట్నం వచ్చింది. 2015 జనవరి 4వ తేదీన అనూహ్య తండ్రి జోనాథాన్‌ప్రసాద్ విజయవాడ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి ముంబై వెళ్లే రైలును ఎక్కించాడు. జనవరి 5వతేదీన ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినల్ వద్ద ఆమె రైలు దిగింది. అక్కడి నుంచి ఆమె నివాసం ఉండే ఇంటికి వెళ్లేందుకు కారు కోసం ఎదురు చూస్తుండగా, టాక్సీ ఉందని చెప్పి చంద్రభాన్ సనప్ ఆమెను తన వెంట రైల్వేస్టేషన్ బయటకు తీసుకువెళ్లాడు. తన వద్ద కారులేదని.. తన మోటార్ బైక్‌పై తీసుకువెళతానని చెప్పాడు. చంద్రభాన్ సనప్ వెనుక అనూహ్య నడచి వెళుతున్న దృశ్యాలు రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి.



ఎస్తేర్ అనూహ్య(ఫైల్)

నాడు మరణశిక్ష విధించిన ముంబై స్పెషల్ ఉమెన్స్ కోర్టు

బైక్‌పై అనూహ్యను తీసుకువెళ్లిన చంద్రభాన్ సనప్ నిర్మానుష్యప్రదేశంలో ఆమెపై లైంగిక దాడికి

మిగతా 6లో..

మ్యుటేషన్ స్కాంలో దొంగలు దొరికేనా!

గుడివాడ మున్సిపాల్టీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చోటుచేసుకున్న మ్యుటేషన్ కుంభకోణంలో విచారణ నత్తనడకన సాగుతోంది. అవినీతికి పాల్పడిన అధికారులు తప్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని బలి చేయాలని వినూత్న ఆలోచనను తెరపైకి తెచ్చారు. అవినీతిపరులకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అభయహస్తం వచ్చినట్లు సమాచారం.

గుడివాడ మున్సిపాల్టీలో 2023-24లో 143 మ్యుటేషన్‌లు

- మున్సిపాల్టీకి చెల్లించకుండా రూ.కోట్లలో నొక్కేసిన ఉద్యోగులు
- నత్తనడకన సాగుతున్న విచారణ
- రెవెన్యూ, కమిషనర్ సీసీలే అసలు సూత్రధారులు
- సంబంధంలేని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని బలి చేసేందుకు కుట్ర

ఆంధ్రజ్యోతి - గుడివాడ: గుడివాడ మున్సిపాల్టీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 143 మ్యుటేషన్‌లు జరిగాయి. కోట్లాది రూపాయలు మున్సిపాల్టీకి జమచేయకుండా కొందరు అవినీతి ఉద్యోగులు తమ జేబులు నింపుకున్నారు. దీనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. అవి నిజమని నిర్ధారణ కావడంతో మున్సిపల్ ఆర్‌డీ ఆదేశాల మేరకు విచారణాధికారిగా తాడిగడప మున్సిపల్ కమిషనర్ నియమితులయ్యారు. ఆయన విచారణ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మ్యుటేషన్ బాధితులను ఒక విడత విచారించారు.

బలి పశువులుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

వైసీపీ హయాంలో జరిగిన ఒక స్కాంలో పర్మినెంట్ ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరిని బలి చేసిన విషయం తెలిసిందే. ఇదే విధంగా మ్యుటేషన్ కుంభకోణంలో పాత్రదారులైన ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో ఎవరో ఒకరిని ఇరికించి బయటపడాలని పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలు చేస్తున్నట్లు సమాచారం.



ఇంటింటికీ తిరిగి వేడుకోలు

మ్యుటేషన్ కుంభకోణంలో పాత్రదారులైన ఉద్యోగులు మ్యుటేషన్ బాధితుల ఇళ్లకు వెళ్లి తమ పేరు చెప్పవద్దని కాళ్లావేళ్లా పడుతున్నట్లు సమాచారం. తాము సూచించే వ్యక్తి పేరు చెప్పాలని, కట్టిన సొమ్ము మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తామంటూ బేరాలకు దిగారు. ఫ్రెండ్ షిప్ పేరుతో, కులం పేరుతో బాధితులను ఆకట్టుకుని తప్పించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం అభయహస్తం!

మ్యుటేషన్ పేరుతో మున్సిపల్ సొమ్మును కొల్లగొట్టిన కొందరు అవినీతి అధికారులకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అభయహస్తం అందినట్లు సమాచారం. ముఖ్యంగా ఎమ్మెల్యేను ఎల్లప్పుడు అంటి పెట్టుకుని ఉండే ప్రైవేట్ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. అవినీతి అధికారులను కాపాడేందుకు సదరు ఎమ్మెల్యే వ్యక్తి కంకణం కట్టుకున్నట్లు, అవినీతిపరులతో బేరసారాలు

మిగతా 6లో..



మెగా డీఎస్సీ షెడ్యూల్ విడుదల చేయాలని ధర్నా

6లో

క్వారీల్లో ఇసుక తవ్వకాలు నిలిపివేత

ఎక్స్‌కవేటర్లు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తోట్లవల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు, నార్తువల్లూరు ప్రభుత్వ క్వారీల్లో మంగళవారం ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం 'జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు తూట్లు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది.
దీనిపై స్పందించిన క్వారీల నిర్వాహకులు వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. అధికారులు ఆకస్మిక తనిఖీలకు వస్తారేమోనని క్వారీలలో ఉన్న ఎక్స్‌కవేటర్‌లను బయటకు తరలించేశారు. ప్రతిరోజు రాత్రి సమయంలో యంత్రాలతో ఇసుక లోడింగ్ జరిగేది. ఆ అలవాటుతోనే మంగళవారం రాత్రి భారీగా లారీలు వచ్చాయి. ఇసుక లోడింగ్ నిలిపివేశారని చెప్పడంతో రొయ్యూరు వద్ద కరకట్టపై లారీలు బారులుతీరి నిలిచిపోయాయి.

ఒరేయ్ ఈవో.. తోలుతీస్తా..

పంచాయతీ కార్యదర్శిపై జనసేన నేత చిందులు

- ఎనికేపాడులో రెండు వర్గాలుగా మారిన సైనికులు
- విగ్రహం ఏర్పాటులో మొదలైన వివాదం
- పంచాయతీ తీర్మానాన్ని కాదని గాంధీ విగ్రహం ఏర్పాటు
- వ్యతిరేకించిన మరో వర్గం.. పరస్పర బాహాబాహీ
- సర్దిచెప్పిన పంచాయతీ కార్యదర్శిపై దూషణలపర్వం



పంచాయతీ కార్యదర్శి (సర్కిల్‌లో)ను వేలుపెట్టి చూపిస్తూ దూషిస్తున్న జనసేన నేత చలమలశెట్టి రమేశ్

విజయవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేశ్.. పంచాయతీ కార్యదర్శిపై నోరు పారేసుకున్నారు. ప్రజల ముందే నోటికి వచ్చినట్టు దూషించారు. 'ఒరేయ్..' దగ్గర నుంచి మొదలుపెట్టి 'తోలుతీసేస్తా..' వరకు వెళ్లారు. ఈ ఘటన విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో మంగళవారం జరిగింది.

విగ్రహాల ఏర్పాటులో రభస

ఎనికేపాడుకు చెందిన టంకశాల సుబ్బారావు కొద్దిరోజుల క్రితం జనసేన పార్టీలో చేరారు. జాతీయ రహదారికి పక్కన చిన్న బస్టాప్ ఉండేది. అక్కడికి ఆకతాయిలు చేరుతున్నారని, జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయించాలని సుబ్బారావు నిర్ణయించారు. ఆయన కుమారుడు శివ.. పంచాయతీ ఉపసర్పంచ్ పదవిలో ఉన్నారు. విగ్రహాల ఏర్పాటుకయ్యే ఖర్చును తాను భరిస్తానని సుబ్బారావు చెప్పారు. ఈ అంశాన్ని పంచాయతీ సమావేశ అజెండాలో ప్రవేశపెట్టారు. ఇందుకు సమావేశం అంగీకరించింది. సుబ్బారావు పదిరోజుల క్రితం వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించారు. తర్వాత ఆయన మరో కుమారుడి విగ్రహాన్ని ఏర్పాటు

మిగతా 6లో..

సమస్యలపై గళమెత్తిన జనం





కార్యక్రమానికి హాజరై.. 'ఆంధ్రజ్యోతి' పేపరు వీక్షిస్తూ..

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ 1 డివిజన్‌లోని మునిసిపల్ పార్కులో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో స్థానిక సమస్యలపై జనం గళమెత్తారు. డివిజన్‌లో అస్తవ్యస్త డ్రెయిన్లు.. తాగునీటి ఇబ్బందులు.. విద్యుత్ సమస్యలు.. ఇలా ఎప్పటి నుంచో ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాని సమస్యలను 'ఆంధ్రజ్యోతి' సమక్షంలో అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. ప్రజల వినతులపై స్పందించిన అధికారులు వారి సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలు, మార్గాలు సూచించారు. ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

- ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

- అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సదస్సు
- మచిలీపట్నం 1వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తరలివచ్చిన స్థానికులు
- అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలు సమస్యలు
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ

తాగునీటికి ఇబ్బందులు

- కూనపరెడ్డి రామారావు



హౌసింగ్ బోర్డు ఏర్పడినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నా. తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రతి రోజూ తాగునీరు ఇవ్వాలని అడుగుతున్నాం. రోజు విడిచి రోజు ఇస్తున్నారు. ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేయాలి.

కల్వర్టులు దెబ్బతినడంతో ప్రమాదాలు

- డి.ఎస్.ఎన్.శాస్త్రి, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్



1971లో ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ ఏర్పడింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నా. మేము ఉండే ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. భారీ వర్షాలు వస్తే డ్రెయిన్లు పొంగుతున్నాయి. కల్వర్టులు శిథిలమయ్యాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గతంలో అమలాపురానికి బస్సు ఉండేది. ఆ బస్సును రద్దు చేశారు. మళ్లీ ఆ బస్సును పునరుద్ధరించాలి.

తాగునీటి ఎద్దడి

-సిద్ధినేని విజయకుమార్



దేవుడిచెరువులో తాగునీటి సమస్య ఉంది. సచివాలయంలో, మునిసిపల్ ఆఫీసులో చెబుతున్నాం. సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలి. ప్రతి రోజూ మంచినీరు ఇవ్వాలి.

వర్షం వస్తే నీటిలోనే రోడ్డు

- పెడసనగంటి నాగబాబు



కల్వర్టు శిథిలమైంది. రోడ్డు పాడయింది. వర్షం వస్తే రోడ్డు మునిగిపోయే పరిస్థితి. సచివాలయ ఉద్యోగులకు చెప్పాం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. మేజర్ డ్రెయిన్లు, మైనర్ డ్రెయిన్లతో కలవక రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది.

పార్కులను అభివృద్ధి చేయాలి

- ఎస్.మహేష్‌బాబు



1వ డివిజన్‌లోని పార్కులను అభివృద్ధి చేయాలి. పాత కాలం నాటి పైపులైన్లు పాడయ్యాయి. కొత్తగా పైపులైన్లు వేయాలి. డీ మార్ట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

- పోలగాని వెంకటేశ్వరరావు, దేవుడిచెరువు



నెలలో 30 రోజులకు వాటర్ ట్యాక్స్ కట్టించుకున్నారు. అయితే 15 రోజులకు మాత్రమే తాగు నీరందిస్తున్నారు. గతంలో వేసవిలో మూడు రోజులకొకసారి మాత్రమే నీళ్లిచ్చారు. ప్రతి రోజూ తాగునీరందించాలి. కృష్ణానది నుంచి నేరుగా మచిలీపట్నంకు నీరు తీసుకురావాలి.

అందరూ సీసీ కెమెరాలు పెట్టుకోవాలి

- నబీ, చిలకలపూడి సీఐ



డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఏదైనా సందర్భంలో ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు మాకు తెలియజేస్తే ప్రత్యేక బీటు ఏర్పాటు చేస్తాం. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేయాలి. ప్రతి కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి. ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

బైపాస్ మీదుగా ఆర్టీసీ సర్వీసులు

- పెద్దిరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్



గతంలో ఆర్టీసీ బస్సులు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లిన మాట నిజమే. అయితే ప్రయాణికులు ఎక్కువ మంది కోనేరుసెంటర్ మీదుగా నడపాలని కోరడం వల్ల విజయవాడ వెళ్లే బస్సులను కోనేరుసెంటర్, మూడు స్తంభాల సెంటర్ మీదుగా నడుపుతున్నాం. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సూచనల మేరకు అవసరమైన చోట బస్సు సర్వీసులు నడుపుతున్నాం.

అడిగిన వెంటనే ధ్రువపత్రాలు

- నాగభూషణం, తహసీల్దార్



ప్రజలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాను. జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అడిగిన వెంటనే జారీ చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు పింఛన్లు, రేషన్‌కార్డులు అందిస్తాం.

పోర్టుతో ఉపాధి అవకాశాలు

-మోటమర్రి బాబాప్రసాద్



ప్రజా సమస్యలను వెలికితీయడంలో 'ఆంధ్రజ్యోతి' ఎప్పుడూ ముందుంటుంది. గతంలో బందరు పోర్టు ఉద్యమంలో తాను నిరాహార దీక్ష చేసినప్పుడు అండగా నిలిచింది. బందరు పోర్టు నిర్మాణం జరుగుతున్నందున పోర్టుతో పాటు పలు పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీని వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ప్రజా ఉద్యమాలకు అండగా ఉంది

- కొనకళ్ల బుల్లయ్య, టీడీపీ రాష్ట్ర నాయకుడు



ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయం. పోర్టు ఉద్యమాన్ని 500 రోజుల పాటు నడిపించేందుకు ఆంధ్రజ్యోతి ఎంతో సహకరించింది. పులిగడ్డ వంతెన కోసం జరిపిన ఉద్యమానికి ఊపిరి పోసింది. పులిగడ్డ వారధి మీదుగా జాతీయ రహదారి మళ్లించాలన్న ఉద్యమానికి తమ మద్దతు తెలపడంతో రేపల్లెకు బస్సు మార్గం సునాయాసమైంది.

ప్రజాగళం విప్పేందుకు అవకాశం

- గొర్రెపాటి గోపీచంద్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



ప్రజలు గళం విప్పేందుకు ఆంధ్రజ్యోతి అవకాశం కల్పించింది. ఐదేళ్లుగా ప్రజలు తమ గళాన్ని విప్పలేకపోయారు. ఎవరైనా ఏదైనా సమస్యను చెప్పినా కేసులు బనాయించేవారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను చెప్పుకునేందుకు ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ కార్యక్రమం దోహదపడుతుంది. హౌసింగ్ బోర్డు కాలనీలో లైబ్రరీ ఏర్పాటు చేశాం.

శక్తివంచన లేకుండా పనిచేస్తున్నాం

- జోగి చిరంజీవి, 1వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్

శక్తివంచన లేకుండా పనిచేస్తున్నాం. కోతుల బెడద సమస్యను అధికారుల ముందుకు తీసుకుని వెళ్లాం. అధికారులు దీనిపై స్పందించాల్సి ఉంది. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది. రాత్రిపూట జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలి. పోలీసు బీట్లు పెంచాలి.

ఏడాదిలో అభివృద్ధి చేసి చూపిస్తాం

- బత్తిన దాసు, మాజీ కౌన్సిలర్



కూటమి ప్రభుత్వం ఇప్పుడే అధికారంలోకి వచ్చింది. ఏడాదిలో ప్రజలు ఆశించిన అభివృద్ధి పనులు చేపడతాం. కల్వర్టులు నిర్మించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర నిధులు కేటాయించారు. రోడ్ల నిర్మాణాలు త్వరలో చేపడతాం. న్యూ హౌసింగ్ బోర్డులో కొనకళ్ల గణపతి పార్కు నిర్మాణం చేపట్టేందుకు కావలసిన నిధులను ఎంపీ బాలశౌరి నుంచి తీసుకుని వస్తాం. తాను కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఓల్డ్ హౌసింగ్ బోర్డుతో పాటు పంచాయతీ రాజ్ పార్కును అభివృద్ధి చేశా. ఆ బిల్లులు ఇప్పటికీ రాలేదు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు, రేషన్‌కార్డులు అందించనుంది. పేదలకు ఇళ్లస్థలాలు అందించనుంది. ఇళ్లు నిర్మించి తీరుతాం.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేపట్టాలి

-అక్కుమహంతి రాజా, టీడీపీ శిష్టకర్ణ రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్



సీఎస్ఆర్ నిధులతో మచిలీపట్నం 1వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంది. 2015లో బెల్ కంపెనీ ద్వారా కోటి 75 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం. జీవిత బీమా సంస్థ కూడా మచిలీపట్నం అభివృద్ధికి నిధులు అందించింది.

ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆగడాలు ఎక్కువయ్యాయి

- కుంచే నాని, టీడీపీ రూరల్ అధ్యక్షుడు



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఒక బడ్డీ ముందు ఆకతాయిల అల్లర్లు ఎక్కువయ్యాయి. కాలనీలోకి వచ్చే మహిళలను ఏడిపిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి.




రామచంద్రాపురం ఎన్ఎస్‌పీ 117 వద్ద సాగునీటిని పరిశీలిస్తున్న కోట వీరబాబు తదితరులు

ఆరుతడి పంటలను కాపాడండి

- ఎన్ఎస్‌పీ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు

విస్సన్నపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ మూడో జోన్‌లో 2.11 లక్షల ఎకరాల్లో సాగు చేసిన ఆరుతడి పంటలను రక్షించాలని ఎన్ఎస్‌పీ మూడో జోన్‌కు నిరాటకంగా 1700 క్యూసెక్కుల సాగర్ జలాలు సరఫరా చేయాలని ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విస్సన్నపేట మండలం రామచంద్రాపురం 117 కి.మీ రెగ్యులేటర్ వద్ద తెలంగాణ రాష్ట్రం నుంచి వస్తున్న సాగర్ జలాలను నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. 12 టీఎంసీ సాగునీటిని విడుదల చేయాలని కృష్ణా రివర్ బోర్డు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తే ఇప్పటి వరకు 2 టీఎంసీలు మాత్రమే పైనుంచి విడుదలయ్యాయన్నారు. రాష్ట్రానికి నిరాటకంగా 1700 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూడోజోన్ డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, కొల్లి వెంకట శ్రీనివాస రెడ్డి, కాపా రాంబాబు, గంధ్ర ప్రసాద్, ఎమ్ఆర్ మోహిద్దీన్, ఈఈ సంతోష్, కవులూరి రాజ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, తదితరులు

రహదారి భద్రత అందరి బాధ్యత

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భద్రమైన సమాజానికి సురక్షిత రహదారులపై సురక్షిత డ్రైవింగ్ కీలకమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారి భద్రతకు బాధ్యతగా ముందడుగు వేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ (కేడీఎల్‌ఓఏ) ఆధ్వర్యంలో జిల్లా రవాణాశాఖ భాగస్వామ్యంతో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. బెంజిసర్కిల్ వద్ద ర్యాలీని పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ప్రారంభించగా, కలెక్టరేట్ వద్ద ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని ప్రతిఒక్కరూ రహదారులను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. రహదారి భద్రత విషయంలో లారీ యజమానుల అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేడీఎల్‌ఓఏ ప్రెసిడెంట్ నగుమోతు రాజా, జనరల్ సెక్రటరీ ఏవీవీ సత్యనారాయణ, డీటీసీ ఎ.మోహన్, ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు, ఎన్‌సీసీ క్యాడట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌర వెలుగుల హరివిల్లు కావాలి

- విద్యుత్ చెల్లింపుల భారం తగ్గించాలన్నదే లక్ష్యం
- పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ



సూర్యఘర్ అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

పటమట/కృష్ణలంక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపి హరివిల్లు చేసుకోవాలని, సోలార్ ప్యానల కనెక్షన్‌ల కొరకు తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశలు పిలుపునిచ్చారు. సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశలు పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభించి గురునానక్ కాలనీ వరకు ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గురునానక్ కాలనీలో సోలార్ ప్యానల్‌ను అమర్చిన గృహాన్ని సందర్శించి లబ్ధిదారుని అభినందించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రజలకు విద్యుత్ చెల్లింపుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అతి తక్కువ ఖర్చుతో లబ్ధిదారులు ఇంటిపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్‌ను ఉచితంగా గృహ అవసరాలకు వినియోగించుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించవలసిన అవసరం వుండదన్నారు. తద్వారా ఎంతో ఆర్థిక ప్రయోజనం పొందగలుగుతారన్నారు. లబ్ధిదారులు రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యు సోలార్ ప్యానల్‌ను రూ.78వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి పై కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందన్నారు.రాయితీ మినహా మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చన్నారు. దాదాపు 20 ఏళ్ల పాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చని వివరించారు. 3 కేవీ వ్యవస్థ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని, మన అవసరాలకు సరిపడా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చునని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందనానరు. లక్ష మందికి పైగా లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు సుమారు 800 మంది లబ్ధిదారులు 10 శాతం భాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. బ్యాంకు నుంచి రుణం పొందిన లబ్ధిదారులు సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని విద్యుత్ బిల్లు చెల్లించడం ద్వారా ఆదా అయ్యే సొమ్మును బ్యాంకు రుణం కింద చెల్లిస్తే రుణం తీరుతుందన్నారు. అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకొని ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటివరకు 70 వేల మంది లబ్ధిదారులు ప్యానెల్ పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు సౌరశక్తి విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య రహిత పర్యావరణహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. అనంతరం సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చుకున్న మన్న నాగ భాస్కరాంబ గృహానికి వెళ్లి ఇంటిపై కప్పుపై సోలార్ ప్యానెల్‌ను పరిశీలించి సోలార్ ప్యానెల్ ద్వారా విద్యుత్ తయారి వినియోగం వివరాలను అడిగి తెలుసుకొని లబ్ధిదారుని అభినందించారు. అవగాహన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, పీవో యూసీడీ పి.వెంకటనారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎ.మురళీమోహన్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, గద్దె క్రాంతి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడ అడవులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మచిలీపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మడ అడవులను ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చుచేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా అటవీశాఖ రేంజ్ అధికారి పి.సునీత, డిప్యూటీ రేంజ్ అధికారి జీవీవీ జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'మడమతిప్పరు' శీర్షికతో మచిలీపట్నం మండలం కానూరులో మడఅడవులను నరికి మడ భూములను ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ప్రత్యేక కథనం వచ్చిన విషయం తెలిసిందే.. ఈ కథనంపై స్పందించిన అటవీశాఖ అధికారులు రెండు రోజులపాటు మచిలీపట్నం మండలంలోని కానూరు, బంటుమిల్లిమండలం మణిమేశ్వరంగ్రామాల పరిధిలోని మడ అడవులను పరిశీలించారు. మడ చెట్లు ఎత్తుగా పెరిగి ఉండటంతో భూముల ఆక్రమణ, మడచెట్ల నరికివేస్తున్న విషయాన్ని పరిశీలించేందుకు కష్టంగా మారిందని, దీంతో డ్రోన్ కెమెరా సాయంతో మడ అడవులలో ఆక్రమణలను చిత్రీకరించామని తెలిపారు. కానూరు గ్రామ పరిధిలో లజ్జబండ డ్రెయినేజీ పక్కన ఏపుగా ఎదిగిన మడచెట్లను కొంతమేర విస్తీర్ణంలో నరకడం ప్రారంభించారని, ఇందుకు బాధ్యుడైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సముద్రతీరం వెంబడి సహజసిద్ధంగా పెరిగే మడ అడవులను నరికి, ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని చూస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.



కానూరు, బంటుమిల్లి మండలం మణిమేశ్వరం గ్రామాల పరిధిలో మడఅడవుల

స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా..

జగ్గయ్యపేట పురపాలక

- పన్ను వసూళ్లు, పనులు చేయటంలో ముందంజ
- పీఎం సూర్యఘర్‌కు 5400 రిజిస్ట్రేషన్లు లక్ష్యం
- పైపులైన్ల మార్పిడితోనే తాగునీటి సరఫరా మెరుగు
- ఆంధ్రజ్యోతితో కమిషనర్ రామ్మోహన్

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)



జగ్గయ్యపేట పట్టణాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించిందని రాష్ట్రంలోనే శానిటేషన్‌లో మోడల్‌గా మారబోతుందని మునిసిపల్ కమిషనర్ రామ్మోహన్ చెప్పారు. చెత్త శుద్ధితో పాటు డంప్ అయిన చెత్తను ప్రాసెస్ చేసి సంపదగా మారుస్తారని చెప్పారు. శానిటేషన్ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, జీతాలకు ఇబ్బంది లేని విధంగా ఆర్థిక పరిస్థితిని తీసుకురాగలిగామని చెప్పారు. అన్ని రంగాల్లో పురపాలకసంఘాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రంగాపురం రాఘవేంద్రల సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు.

'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు..

? పట్టణంలో శానిటేషన్ పరిస్థితి ఎలా ఉంది..

- జిల్లా స్వచ్ఛాంధ్ర మిషన్ పైలట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేట పురపాలక సంఘాన్ని ఎంపిక చేశారు. రాష్ట్రంలోనే చెత్తశుద్ధి, చెత్త డంప్‌లు లేని పురపాలకసంఘంగా మారబోతుంది.

? ప్రాజెక్టు అమలయ్యేలోపు పారిశుధ్యం ఎలా..

- ప్రస్తుతం 4 ఇ-ఆటోలకు 2 ట్రాకర్లు పనిచేస్తున్నాయి. 45 తోపుడు బండ్లు, 2 ఆటోలతో నెట్టుకొస్తున్నాం. మినీ జేసీబీ, కాంపాక్టర్స్ పనిచేస్తున్నాయి. 15వ ఆర్థికసంఘం నిధులతో 55 తోపుడు బండ్లు, 55 బిన్స్ కొనుగోలు చేయబోతున్నాం

? పన్ను వసూళ్లు ఎలా ఉన్నాయి.

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.34 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు ఉండగా, రూ.2.67 కోట్లు వసూలైంది. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు, డబుల్ అసెస్మెంట్లు వల్ల ఇబ్బందులు ఉన్నాయి.

? తాగునీటి సరఫరా ఎప్పుడు మెరుగుపడుతుంది.

- పుష్కలంగా తాగునీటి వనరులు ఉన్నా, పంపిణీ వ్యవస్థ 50 ఏళ్ల నాటిది కావటంతో సమస్య ఉంది. వాటర్ వర్క్స్‌లో పలు పనులకు రూ.50లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

? పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు ఎలా ఉన్నాయి.

- ప్రభుత్వం 5400 రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టగా, 1100 చేశాం. ఇంకా కొనసాగుతున్నాయి.

? గుంతల పూడ్చివేత ఎంత వరకు వచ్చింది.

- కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో కొంత జాప్యం జరిగింది. పట్టణంలో రెండు ప్యాకేజీల కింద 141 గుంతలు పూడ్చేందుకు రూ.9 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 20శాతం పనులు జరిగాయి. ఈ నెలాకరు కల్లా పూర్తి చేస్తాం.

? ఉద్యోగులు జీతాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కదా!

- పన్నుల వసూళ్లతో పరిస్థితి మెరుగైంది. జీతాలకు ఎదురుచూడాల్సిన పరిస్థితి కార్మికులకు, సిబ్బందికి లేకుండా చేశాం. కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపులు ఇచ్చుకుంటు వస్తాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480	

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర రైతు సమైక్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరులోని చెరువులు, కుంటలకు వెళ్లే కాలువల పూడికతీత పనులను మంగళవారం నీటి సంఘ అధ్యక్షులు, ప్రతినిధులతో కలిసి పూజచేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అవిర్నేని భవానిశంకర్, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, కాజ సురేష్, అంగడాల సీతారామస్వామి, పల్లగాని కిషోర్, యార్లగడ్డ సాంబశివరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాష్ట్ర రైతు సమైక్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు



హెల్మెట్ అవగాహనా ర్యాలీలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు వెంకటరమణ, వెంకటనారాయణ

రహదారి భద్రతే జీవితానికి నేస్తం

● గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు

పెనమలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రహదారులపై సురక్షితంగా ప్రయాణిస్తూ గమ్యాన్ని చేరడమే నిజమైన నేస్తమని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తాడిగడప సెంటరులో బందరు రోడ్డుపై జరిగిన హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాముఖ్యత అవగాహన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ ధరించడం వల్ల మనల్ని మనం యాక్సిడెంట్ల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించనిచో వెయ్యి రూపాయల జరిమానాతో పాటు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. వాహనదారుల జీవితాలపై కుటుంబసభ్యుల జీవితాలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. ర్యాలీలో పెనమలూరు సీఐ వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఆర్టీఓ శ్రీనివాస్, ఎంవీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కంకిపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొణతనపాడుకు చెందిన కొడాలి శ్వేత కుమార్తె నిత్య (6) గత నెల 31న తల్లిదండ్రులు లేని సమయంలో ఆరుబయట అగ్గిపెట్టితో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పంటుకుంది. దీంతో గాయాలపాలైన నిత్యను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి మంగళవారం మృతి చెందింది. తల్లి శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి..

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లనపల్లిలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులపాక నాగభూషణం(45) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతను ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి చుట్టు పక్కల గాలించారు. మంగళవారం గ్రామంలోని ఊర చెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీయగా నాగభూషణంగా గుర్తించారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని భావించి అతని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిడమానూరులో పీఎం సూర్యఘర్ పథకాన్ని వివరిస్తూ ర్యాలీ

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రసాదంపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు విద్యుత్ బిల్లుల చెల్లింపుల భారం తగ్గించేందుకు అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటిని సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలని కనెక్షన్ కోసం తక్షణమే పేర్లు నమోదు చేసుకోవాలని మెప్మా పీడీ సాయిబాబు అన్నారు. మంగళవారం నిడమానూరులో విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక ఆఫీసర్ శిల్ప, ఎంపీడీవో విఘ్నేష్, తహసీల్దార్ బి.సుగుణ, విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు, పంచాయతీ ఈవో నరసింహారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు ఆకలి నుంచి ఉపశమనానికి దాతలు అల్పాహారం అందించడం అభినందనీయమని హెచ్ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు దాత యనమదల సుధాకర్ అందజేసిన అల్పాహారాన్ని విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి వెంకట కృష్ణారావు, చల్లగుళ్ల లోకేశ్వరరావు, నిమ్మకూరి రంగారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సొడిమెళ్ల శ్యామ్, దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీకేఆర్ వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీకేఆర్ వృద్ధాశ్రమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేసినట్టు మంగళవారం బ్యాంకు మేనేజర్ ఎ.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బీకేఆర్ సేవా సంస్థల చైర్మన్ కానూరి శేషుమాధవి మాట్లాడుతూ, వృద్ధులకు అనాథ బాలలకు అండగా నిలిచేందుకు సహకారం అందించిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమంలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్రెడిట్ ఆఫీసర్ జి.సుమన్, బి.శ్రావణి, మధు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచ్ పిల్లా అనిత అన్నారు. వీరవల్లి ఆర్‌పీహెచ్ కాలనీలోని అంతర్గత సీసీ రహదారుల నిర్మాణాన్ని మంగళవారం పూజ చేసి ప్రారంభించారు. త్వరలోనే డ్రైనేజీ పూడికతీత పనులను కూడా మొదలుపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, రంగమ్మ పాల్గొన్నారు.



వీరవల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పిల్లా అనిత, అమృతపల్లి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ లంక అజయ్

నిధులు వృథా చేయొద్దు

ఎంపీ వల్లభనేని బాలశౌరి

హనుమాన్‌జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిధులు పూర్తిస్థాయిలో సమకూరే వరకు కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని వాయిదా వేయాలని తొందరపడి నిధులు వృథా చేయవద్దని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బాపులపాడు మండల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బాపులపాడు ఇందిరానగర్‌లో గత ప్రభుత్వం హయాంలో రూ.1.83 కోట్లు అంచనాలతో కమ్యూనిటీ హాలు (కల్యాణ మండపం) నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. అదే సమయంలో అప్పటి ఎంపీగా ఉన్న బాలశౌరి మరో రూ.50 లక్షలు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేశారు. రాష్ట్ర నిధులు మంజూరు చేయడంతో ఎన్నికల నేపథ్యంలో పనులు చేపట్టి కొంత భాగం పిల్లర్లు, పైకప్పు నిర్మించి అసంపూర్తిగా నిలిపివేశారు. ఎంపీ రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి భూమిపూజ నిర్వహించారు. భవన నిర్మాణం బాధ్యత ఎవరు తీసుకుంటున్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంత ఖర్చు అవసరం, గత రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు విడుదల అయ్యాయా లేదా అన్న విషయాలపై పంచాయతీరాజ్ ఏఈ జయరాజ్‌ను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణం, నిధులు మీద ఎంపీకి సరైన వివరణ రాకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అవసరమైన నిధులను తాను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. భవన నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు సమకూరే వరకు వేచి ఉండాలని సూచించారు. తాను ప్రస్తుతం మంజూరు చేసిన రూ.50లక్షలతో భవన నిర్మాణం పూర్తికాని పక్షంలో దశల వారీగా ఏళ్ల తరబడి నిర్మాణం జరపడం సమంజసం కాదని తెలిపారు. కమిటీ ఏర్పాటు చేసుకొని నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతి చిన్నా, టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు దయాల రాజేశ్వరరావు, వడ్డి నాగేశ్వరరావు, తోట మురళీకృష్ణ, జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, నూకల జ్యోతి, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి పాల్గొన్నారు.



బాపులపాడు కమ్యూనిటీ హాలు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి



బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, గన్నె వెంకట్రావు

గన్నవరం బాలోత్సవం 1న

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గన్నవరం బాలోత్సవం తృతీయ పిల్లల పండుగ ఫిబ్రవరి 1న స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఈ మేరకు బాలికల హైస్కూల్‌లో గన్నవరం బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, గన్నవరంతో పాటు ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి కూడా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులు 23 విద్య సంబంధమైన, పది సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఎంట్రీ ఫారాలు సమర్పించేందుకు బుధవారం సాయంత్రం వరకూ అవకాశం ఉందని తెలిపారు. బాలోత్సవం అధ్యక్షుడు గన్నె వెంకట్రావు ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, హెచ్ఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పెయ్యదూడలతో పాడిపరిశ్రమకు ప్రోత్సాహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : అధునీకరించిన లింగ నిర్ధారిత కృత్రిమ గర్భధారణ ద్వారా కోరుకున్న పెయ్యదూడలను పొందవచ్చని తద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధితో రైతులు ఆర్థిక స్వావలంబన సాధించ వచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ చిన్న నరసింహాలు, డాక్టర్ హరిత తెలిపారు. మల్లవల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, గన్నవరం ఆధ్వర్యంలో క్రిభ్‌కో ఎరువుల కంపెనీ సహకారంతో మంగళవారం నిర్వహించిన మెగా పశు ఆరోగ్య శిబిరంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పర్యవేక్షణలో పెయ్యదూడల అందాల పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 45 పశువులకు వైద్యపరీక్షలు, 86 పశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలు నిర్వహించారు.



పశు ఆరోగ్య శిబిరంలో పెయ్యదూడల పెంపకం గురించి వివరిస్తున్న డాక్టర్లు

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు ఇందిరానగర్‌లో నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థానిక అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. మంగళవారం హాలు నిర్మాణానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ సమక్షంలో నరసింహారావు విరాళం ప్రకటించారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిక్కవరం బ్రహ్మయ్యలింగం చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పీఎంఎం ఎస్‌వై పథకం క్రింద చేప పిల్లలను మంగళవారం పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మత్స్యకారులకు ఆర్థిక చేయూత, జీవనోపాధి మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గానికి వరంగా ఉండాల్సిన బ్రహ్మలింగయ్య చెరువు అక్రమార్కులకు వరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పూడికతీత పేరుతో మట్టిని అమ్ము కున్నారని ఆరోపించారు. చెరువుపై విజిలెన్స్ ఎంక్వైరి జరుగుతుందని, మట్టి ఎంత మేర తవ్వారో, ఎంత అవినీతికి పాల్పడ్డారో విజిలెన్స్ ఎంక్వైరీలో తేలుతుందన్నారు. గ్రామాలకు సంబంధించిన చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, చెరువులను కాపాడుకునేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, బ్రహ్మలింగం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు చిట్టినేని శివరామకృష్ణ తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, చిట్టినేని జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మయ్యలింగం చెరువులో చేపలు పోస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

సమగ్ర సస్యరక్షణతో మినుములో మేలైన దిగుబడులు

ఉంగుటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మినుము, పెసర వంటి అపరాల పైరుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడంద్వారా మేలైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మానికొండలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు మురళీకృష్ణ, భానుప్రియ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మినుము పూతదశలో మారుకా మచ్చల పురుగు అక్కడక్కడా కనిపిస్తోందని సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి జె.భవాని సూచించారు. కాకులపాడులో మంగళవారం పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పూతదశలోనే వేపనూనె పిచికారి చేయడం వల్ల గుడ్డు పెట్టకుండా అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ ఏలు, సూరపనేని ఆనంద్, పొట్లూరి వీరవెంకట జగన్, అట్లూరి వెంకమ్మ, తదితర రైతులు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : నున్నలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి డీఎంహెచ్ విజయకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకుడు బి. వెంకటేశ్వరరావు హాజరై ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారినీలిమ, పశుసంవర్ధక సహాయకులు కె. జయశ్రీ పాల్గొన్నారు.



కాకులపాడులో మినుము పైరు పరిశీలిస్తున్న అధికారులు



నున్నలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న అధికారులు

కూటమి పాలనలో గ్రామాలకు మహర్దశ

పమిడిముక్కల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 36 లక్షలతో కపిలేశ్వరపురంలో నిర్మించిన ఏడు సీసీ రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, సాయిదత్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

చర్చి ప్రతిష్ఠకు విరాళం

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అవుటపల్లి ఆర్సీఎం చర్చి ప్రతిష్ఠ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు రూ.10వేలు పంపారు. ఆ నగదును గ్రామ పార్టీ అధ్యక్షుడు చల్లా డేవిడ్‌రాజు చేతుల మీదుగా మత పెద్దలకు మంగళవారం అందజేశారు.



జంక్షన్ ఇందిరానగర్‌లో కాపు కమ్యూనిటీ హాలు భూమిపూజలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, చిత్రంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

తాగునీటి సమస్య పరిష్కారానికి

రూ.3,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు

● ఎంపీ బాలశౌరి

హనుమాన్‌జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. జల్‌జీవన్ మిషన్ నిధుల నుంచి రూ.3,500 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్టును రూపొందించినట్టు వెల్లడించారు. మంగళవారం బాపులపాడు గ్రామంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి భూమిపూజ నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మాటాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రధాని మోదీని కలిసి రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారన్నారు. కేంద్ర ఉపాధి నిధులతో రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు. బందరు పోర్టు ఏడాదిన్నరలో పూర్తవుతుందన్నారు. జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ సమస్యలపై నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధికి ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి చేస్తున్నారన్నారు. జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతి చిన్నా, టీడీపీ, జనసేన, బీజేపీ మండల నేతలు దయాల రాజేశ్వరరావు, వడ్డి నాగేశ్వరరావు, తోట మురళీ కృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: యార్లగడ్డ

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఆ దిశగా పని చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ఇబ్బంది కలిగించకుండా గాంధీబొమ్మ చుట్టూ సుందరీకరణ చేయాలని సూచించారు. గాంధీబొమ్మ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని నిధులు లేకుంటే స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానన్నారు. గన్నవరం అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మతో మాట్లాడి ప్రాథమిక అవసరాలను గుర్తించి అత్యాధునిక వైద్య పరికరాలు ఆస్పత్రికి కావాల్సిన మరమ్మతుల అంశాలపై ఆరాతీశారు. మరో నాలుగు గదులు ఏర్పాటు చేసి మరుగుదొడ్లు, నిర్మాణాలకు మరమ్మతులకు ఎంపీ నిధులు కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. రోగులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉపసర్పంచ్ పాలడుగు నాని, కమిటీ సభ్యులు దేవినేని సులోచన, బుస్సే నాగ ప్రసాద్, ఎంపీటీసీలు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని కొండపావులూరు శివారు ముదిరాజుపాలెంలో రూ.15లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాలుకు ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

● ప్రాధాన్యత క్రమంలో 15వేల ఉద్యోగాలు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ



అభ్యర్థికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యమని, ప్రాధాన్యత క్రమంలో 15వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించి మాట్లాడుతూ అమర్‌రాజా గ్రూప్ వెయ్యి ఉద్యోగాలు, ఎం గ్రూప్‌లో 100 ఉద్యోగాలిచ్చేందుకు వచ్చాయన్నారు. నెల క్రితం నిర్వహించిన జాబ్ మేళాలో 1535 మందికి నాన్ ఐటీ, 72 మంది ఐటీ ఉద్యోగాలు కల్పించినట్టు గుర్తు చేశారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇచ్చిన మల్లవల్లి హామీని ఇప్పటికే అమలు చేశానన్నారు. సుమారు 420 కంపెనీలు మల్లవల్లికి రానున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంకు చరిత్ర లో తనకు ఎప్పటికీ ఒక పేజీ ఉంటుందన్నారు. బ్రహ్మయ్య లింగయ్య చెరువులో మట్టి తవ్విన పాపం ఊరికే పోదని హెచ్చరించారు. పోలవరం కాలువను ఏలూరు కాలువకు అనుసంధానం చేస్తానని, ఏలూరు కాలువపై వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చానని దానికి అనుగుణంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తన కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వాస్పత్రిని కూడా అభివృద్ధి చేయలేకపోయాడని విమర్శించారు. కూటమి నేతలు చిరుమామిళ్ల సూర్యం, చలమలశెట్టి రమేష్, దొంతు చిన్న, మూల్పూరి సాయికళ్యాణి, మేడేపల్లి రమాదేవి, దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, గొడ్డళ్ల చిన రామారావు, చిమట రవివర్మ, ఎంపీటీసీ పడమట రంగారావు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, వేదికపై ఆశీనులైన పలువురు బీసీ నేతలు

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా

బాబు, పవన్ చొరవ తీసుకోవాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ధర్నాచౌక్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే చొరవ తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన బీసీ కులాల సమావేశం గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటుతున్నా బీసీలు రాజ్యాధికారం సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ బీసీ బిల్లుపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానన్నారు. జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఓబీసీ డిమాండ్లకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. దీనిపై పవన్ కల్యాణ్‌తో చర్చిస్తామన్నారు. ఎన్.మారేష్ మాట్లాడుతూ కేంద్రంలో కీలకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు సహకరించాలన్నారు. బీసీబీ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు కృషి చేయాలని తీర్మానించారు. అనంతరం మోదీ చిత్రపటానికి నేతలు పాలభిషేకం చేశారు. పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

టిడ్కో చైర్మన్‌కు అవమానం

- దుర్గగుడిలో ఇన్‌స్పెక్టర్‌పై మంత్రి ఆనంకు ఫిర్యాదు
- మంత్రి ఆలయానికి విచ్చేసి చైర్మన్‌కు దర్శనం కల్పించిన వైనం
- సీఎంకు ఫిర్యాదు చేస్తానన్న చైర్మన్ అజయ్‌కుమార్

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గగుడిలో అమ్మవారి హారతులకు కుటుంబ సభ్యులతో విచ్చేసిన ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌కు అవమానం జరిగింది. ఈ ఘటనపై ఆయన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం టిడ్కో చైర్మన్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి హారతులకు విచ్చేశారు. ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు టిక్కెట్లు కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. విధుల్లో ఉన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ జి.ఎన్.ఎల్.ఆర్ చౌదరి టిడ్కో చైర్మన్‌కు ప్రొటోకాల్ ఉన్నప్పటికీ వెనుక వైపున కూర్చోబెట్టారు. దీంతో చైర్మన్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించగా, ఆయన దురుసుగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో ఆయన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి హుటాహుటిన ఆలయానికి విచ్చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని చైర్మన్‌ను, ఆయన కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ వ్యవహారంపై తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానని చెప్పినట్టు తెలిసింది. ఈ సంఘటన దేవస్థానంలో చర్చనీయాంశమైంది.

మెగా డీఎస్సీ షెడ్యూల్

వెంటనే విడుదల చేయాలి

● అవనిగడ్డలో ఉద్యోగార్థుల నిరసన ప్రదర్శన, రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించి నిరసన ప్రదర్శన చేస్తున్న నిరుద్యోగులు

అవనిగడ్డ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని అవనిగడ్డలో డీఎస్సీ కోసం శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు నిరసన ప్రదర్శన చేపట్టి, రాస్తారోకో చేశారు. మంగళవారం ఉదయం అవనిగడ్డ గ్రంథాలయం వద్ద సమావేశమైన ఉద్యోగార్థులు అక్కడి నుంచి ర్యాలీగా వంతెన సెంటర్‌కు చేరుకుని కొద్దిసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి అనంతరం రహదారికి అడ్డుగా బైఠాయించారు. నిరుద్యోగులు ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించటంతో అవనిగడ్డకు వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి దాదాపు అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. డీఎస్సీ పేరుతో ఏడేళ్లుగా ప్రభుత్వాలు తమను వంచిస్తున్నాయని, కుటుంబానికి ఆధారంగా నిలవాల్సిన తాము డీఎస్సీ కోసం శిక్షణ పొందుతూ 30 ఏళ్లు దాటినా తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సిన దుస్థితి తమకు దాపురించిందన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి డీఎస్సీ కోసం శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించటంతో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక వెళ్లే రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అవనిగడ్డ సీఐ యువకుమార్ నేతృత్వంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది నిరుద్యోగులతో మాట్లాడి శాంతియుతంగా నిరసన తెలపాలి కానీ, ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఉద్యోగాలు పొందాల్సిన సమయంలో కేసులు మంచిది కాదని నచ్చచెప్పి పంపించి వేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న నేతృత్వంలో డీఎస్సీ అభ్యర్థులు రఘు, ప్రవీణ, శ్రీను, పావని, లక్ష్మీరాజు, కృష్ణాంజనేయులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సంస్థ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రుద్రకోటి సదాశివం, డైరెక్టర్ సురవరపు నాగరాజుకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు అభినందనలు తెలిపారు. అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారామ్‌ను ఎంపీ సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శులు గన్నే ప్రసాద్, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఎంపీని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, డైరెక్టర్ నాగరాజును సత్కరిస్తున్న ఎంపీ

కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయించండి

రాష్ట్రంలోని కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయించాలని ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఏపీ సంగీత వాయిద్య సంగీత వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షురాలు ఎస్.మీరాబీ, సెక్రటరీ షణ్ముఖ శ్రీనివాస్ కోరారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో వారు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసి కళాకారులకు గుర్తింపు కార్డులతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఎస్.మీరాబీతో పాటు ఉపాధ్యక్షుడు వి.కృష్ణ, సెక్రటరీ షణ్ముఖ శ్రీనివాస్, కోశాధికారి ఎం.నారాయణరావు, సహాయ కోశాధికారి కె.ఆర్.ఈశ్వర్ పాల్గొన్నారు.



శివనాథ్‌ను కలిసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీజేపీ రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్.కృష్ణయ్యకు సాదర స్వాగతం పలికిన ఎంపీ కేశినేని శివనాథ్ ఆయన్ను శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ, కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.భాను ప్రకాష్ యాదవ్, విజయవాడ బీసీ సంఘం అధ్యక్షుడు తనిశెట్టి లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ సంఘం అధికార ప్రతినిధి పట్నాల హరిబాబు, సీనియర్ బీసీ నేతలు మారేష్ తదితరులు పాల్గొన్నారు.



శివనాథ్‌ను కలిసిన అనంతపురం ఎంపీ

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని మంగళవారం గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్‌కు ఆయ న పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్లమెంట్‌లో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో చ ర్చించాల్సిన అంశాలతోపాటు రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుకున్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా నేతలు జి.కొండయ్య, వి.నరసింహారావు పాల్గొన్నారు.

మ్యుటేషన్ స్కాంలో

దొంగలు దొరికేనా!

(3వ పేజీ తరువాయి)

మాట్లాడుకున్నట్లు వినికిడి.

అంతా ఆన్‌లైన్‌లోనే....

మ్యుటేషన్ స్కాంలో పేర్ల మార్పు అంతా ఆన్‌లైన్ విధానంలోనే జరిగింది. పాత మున్సిపల్ కమిషనర్ ఐ.డి, పాస్‌వర్డ్ లాగిన్‌తోనే ఎక్కువగా మ్యుటేషన్‌లు చేశారని గుర్తించారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి, ఇద్దరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, కార్యాలయంలోని సంబంధిత ఉద్యోగి, ఫైరవీల ఉద్యోగి, కంప్యూటర్ ఆపరేటర్‌లే చక్రం తిప్పినవారిలో ఉన్నారు. మ్యుటేషన్ దరఖాస్తుదారుల్లో కొందరు నేరుగా కార్యాలయానికి వచ్చి మ్యుటేషన్ నగదు చెల్లించగా, రెవెన్యూ సిబ్బంది నేరుగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి నగదు తెచ్చుకున్నట్లు పక్కా సమాచారం. మ్యుటేషన్ సొమ్ము అంతా ఔట్ సోర్సింగ్ సిబ్బంది జేబుల్లోకి వెళితే, ఏ విధంగా ఆర్.ఐలు, ఆర్.వో, మున్సిపల్ కమిషనర్, సి.సిలు పేర్లు మార్పు చేపట్టారో అనే అనుమానం వ్యక్తమవుతుంది.

మ్యుటేషన్ రిజిస్టర్ ఎక్కడ ?

మ్యుటేషన్ (ఆస్తి పేరు మార్పు) రిజిస్టర్ జాడ గుడివాడ మున్సిపాల్టీలో తెలియరావడం లేదు. గత ఏడాదిగా ఎటువంటి రిజిస్టర్ నిర్వహణ చేయడం లేదు. దరఖాస్తుదారుని వివరాలతో పాటు అతను చెల్లించిన నగదు వివరాలు, దరఖాస్తు తేదీ, పేరు మార్పు చేసిన వివరాలను కమిషనర్ సంతకాలతో రిజిస్టర్‌ను అందుబాటులో ఉండాలి. అటువంటి రిజిస్టర్ మున్సిపాల్టీలో అందుబాటులో లేకుండా మున్సిపల్ అధికారులే వ్యక్తిగతంగా రిజిస్టర్‌లను పెట్టుకుని పని కానిస్తున్నారనే సందేహం కలుగుతోంది. కనీసం ఎవరి ఆస్తి ఎవరి పేరున మార్పు చేశారో నోట్ ఫైల్స్, కార్యాలయ కాపీలు రెవెన్యూ విభాగంలో అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పేరు మార్పుకు, నగదు చెల్లింపు తేదీల్లో తేడా...

మ్యుటేషన్ పేరు మార్పుకు, మున్సిపాల్టీకి నగదు చెల్లించిన తేదీల్లో భారీ తేడాలున్నట్లు సమాచారం. ఇటీవల ఒక దుకాణదారుడు తన పేరుతో ఆస్తి మారిందో లేదో అనే అనుమానంతో తొలుత చూడగా మారినట్టు గమనించాడు. రశీదు ఇవ్వాలని కోరడంతో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తాత్సరం చేస్తూ వచ్చినట్టు బాధితుడు తెలిపారు. మ్యుటేషన్ స్కాం బయటపడటంతో మళ్లీ ఆన్‌లైన్‌లో చెక్ చేయగా పాత యజమాని పేరు ఉన్నట్లు గుర్తించి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను నిలదీశారు. హడావుడిగా మ్యుటేషన్ సొమ్మును కట్టి రశీదు ఇచ్చినట్లు సమాచారం. పేరు మార్చినట్టు ఇచ్చిన రశీదుకు, నగదు చెల్లించినట్టు ఇచ్చిన రశీదుకు నెల తేడా ఉన్నట్లు గుర్తించి నోరెళ్లబెట్టారు.

నత్తనడకన విచారణ

2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 143 దరఖాస్తుల్లో 20 కేవలం పేరుతో స్పెల్లింగ్ కరెక్షన్‌లుండగా, 62 మంది విచారణకు హాజరయ్యారు. వీరితో లిఖితపూర్వకంగా విచారణాధికారి సమాచారం తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ల నుంచి రెవెన్యూ ఉద్యోగుల వరకు మ్యుటేషన్ కుంభకోణంలో పాత్రదారులు కావడంతో విచారణ నత్తనడకన సాగుతుందని పట్టణవాసులు గుసగుసలాడుకుంటున్నారు.

ఒరేయ్ ఈవో.. తోలుతీస్తా..

(3వ పేజీ తరువాయి)

చేయాలని భావిస్తే స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ వ్యక్తుల విగ్రహాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించడంతో సుబ్బారావు వెనక్కి తగ్గారు. తర్వాత గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. ఇంతలో మండల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న పొదిలి దుర్గారావు గాంధీజీ విగ్రహం స్థానంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. దీంతో వివాదం ఏర్పడింది. విషయం తెలియడంతో పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ విద్యాధర్ ఘటనాస్థలానికి వెళ్లి రెండువర్గాలకు సర్దిచెప్పారు. ఇక్కడ ఎవరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న అంశంపై పంచాయతీలో మరో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని పెద్దలు, పాలకవర్గం కలిసి ఒక కమిటీగా ఏర్పడి ఓ నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇదిలా ఉండగా, సుబ్బారావు సోమవారం రాత్రి వంగవీటి మోహన్‌రంగా విగ్రహం పక్కనే గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి రమేశ్‌ను ఆహ్వానించారు. అక్కడికి దుర్గారావు వర్గం చేరుకుని ఎవరినీ సంప్రదించకుండా గాంధీజీ విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీంతో సుబ్బారావు, దుర్గారావు వర్గాల మధ్య వివాదం రేగింది. సమాచారం తెలుసుకున్న ఈవో విద్యాధర్ ఘటనాస్థలానికి చేరుకుని పెద్దలతో చర్చించాక నిర్ణయం తీసుకోవాలని అనుకున్నాక.. గాంధీజీ విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీనికి అక్కడే ఉన్న చలమలశెట్టి రమేశ్ పూనకం వచ్చినట్టు ఊగిపోయారు. 'ఒరేయ్.. ఈవో మమ్మల్ని అడగటానికి నువ్వెవడివి..? నువ్వొక పాలేరువి.. నువ్వెంత, నీ బతుకెంత... తోలుతీస్తా జాగ్రత్త...' అంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. తర్వాత అక్కడున్న వారంతా ఈవోను ఘటనాస్థలం నుంచి పంపేశారు.

ఆయన ఈవో అని తెలియలేదు : చలమలశెట్టి రమేశ్

దుర్గారావు పార్టీలో కార్యకర్త మాత్రమేనని, ఆయనకు ఎలాంటి పదవి లేదని రమేశ్ చెబుతున్నారు. జరిగిన ఘటనపై తాను ఎంపీ బాలశౌరి, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు సామినేని ఉదయభానుతో ఫోన్‌లో మాట్లాడానని పేర్కొన్నారు. మండల కమిటీలు రద్దయ్యాయని ఉదయభాను అన్నారని వివరించారు. దీని ప్రకారం చూస్తే దుర్గారావు ఎలాంటి పదవి పార్టీలో లేదని చలమలశెట్టి రమేశ్ చెబుతున్నారు. ఆయన ఈవో అని తెలియక దురుసుగా ప్రవర్తించానని చెప్పారు. పంచాయతీ సమావేశంలో చేసిన నిర్ణయానికి విరుద్ధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు తాను ప్రశ్నించానని ఈవో విద్యాధర్ పేర్కొన్నారు.

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తాం : పొదిలి దుర్గారావు

చలమలశెట్టి రమేశ్ తీరుపై ఎంపీ బాలశౌరి, జనసేన అధిష్ఠానానికి, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తామని పొదిలి దుర్గారావు పేర్కొన్నారు. టంకశాల సుబ్బారావు కొద్దినెలల క్రితమే పార్టీలో చేరారని, జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తాము చెబితే, రాత్రికిరాత్రి గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. చలమలశెట్టి రమేశ్‌ను ఆహ్వానించి కొబ్బరికాయలు కొట్టించారని, తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీలో జరిగిన నిర్ణయానికి వ్యతిరేకంగా విగ్రహం ఏర్పాటు చేసినందుకు పంచాయతీ కార్యదర్శి ప్రశ్నించారని, ఆయన్ను ఇష్టానుసారంగా కొట్టికొచ్చినట్టు దూషించారని పేర్కొన్నారు.

పదేళ్ల తర్వాత అనూహ్యంగా..

(3వ పేజీ తరువాయి)

పాల్పడి, ఆపై హత్య చేసినట్లుగా నిర్ధారణ చేసుకుని పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన ముంబై స్పెషల్ ఉమెన్స్ కోర్టు అప్పట్లో నిందితుడికి మరణశిక్ష విధించింది. దీంతో నిందితుడు చంద్రభాన్ ముంబై హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు అతని అప్పీలును తిరస్కరించింది. ఈ నేపథ్యంలో నిందితుడు సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ చూపిన సాక్ష్యాధారాలు సక్రమంగా లేవనే కారణంతో చంద్రభాన్ సనప్‌ను నిర్దోషిగా చూపుతూ.. అతన్ని విడుదల చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఘటన

అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఉద్యమాలు జరిగాయి. అప్పటి మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎంపీ సుజనా చౌదరితో కలసి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఈ కేసులో నిందితుడిని త్వరితగతిన గుర్తించేందుకు, శిక్షపడేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు. అనూహ్య తండ్రి జోనాతాన్‌ప్రసాద్‌ను అప్పటి కేంద్ర హోంమంత్రి షిండే వద్దకు తీసుకువెళ్లి విషయం వివరించారు. దీంతో ఈ కేసులో నిందితుడిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు విచారణను వేగవంతం చేశారు. నిందితుడిని గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. అయితే పదేళ్ల తర్వాత ఈ కేసులో మరణశిక్ష పడిన నిందితుడిపై ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాధారాలు చూపని కారణంగా అతనిని నిర్దోషిగా విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

బాధ కలిగించింది : జోనాతాన్‌ప్రసాద్, ఎస్తేర్ అనూహ్య తండ్రి

నా కుమార్తె ఎస్తేర్ అనూహ్య హత్య కేసులో నిందితుడిని సుప్రీంకోర్టు నిర్దోషిగా విడుదల చేసిందనే విషయం తెలిసి చాలా బాధ కలిగించింది. అనూహ్య హత్య జరిగిన ప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు నిందితుడు చంద్రభాన్ సనప్‌కు సంబంధించిన ఐడీకార్డు, ఇతరత్రా సాక్షాధారాలను సేకరించిన తర్వాతనే అతన్ని అరెస్ట్ చేశారు. స్పెషల్ ఉమెన్స్ కోర్టు నిందితుడికి మరణశిక్ష విధించింది. ముంబై హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. దీంతో ఈ కేసులో న్యాయం జరిగిందని భావించా. అయితే సుప్రీంకోర్టులో ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలు సక్రమంగా లేవని నిర్ధారించి నిందితుడి విడుదలకు ఆదేశించిందని తెలిసింది. సుప్రీంకోర్టు తీర్పును నేను ఇంకా పరిశీలించలేదు.



పంట పొలాలకు దారిలేకుండా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

పాతపాడులో అనధికారిక ప్లాట్లు

- రైతులను ఇబ్బంది పెడుతున్న వెంచర్ నిర్వాహకులు
- అనధికార ప్లాట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి - బాధిత రైతులు

విజయవాడ రూరల్ /వన్‌టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసింది అనధికార లే అవుట్! నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్ వేసి రహదారులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేస్తున్నారు. వాటి వెంబడి పొలాల్లోకి రైతులు వెళ్లాలంటే చుట్టూ ఉన్న ఫెన్సింగ్ దాటాలి. దీంతో పొలాల్లోకి స్వేచ్ఛగా వెళ్లే పరిస్థితి లేదు. సీఆర్‌డీఏ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కన్నెత్తి చూడని పరిస్థితి. విజయవాడ రూరల్ మండలం, పాతపాడు గ్రామ పరిధిలో ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులు అనధికారికంగా పాట్లు వేసి సమీప రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతపాడు గ్రామ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్లు 366/1, 366/2ఏలో ఉన్న సుమారు నాలుగెకరాల భూమిలో ముగ్గురు వ్యక్తులు సీఆర్‌డీఏ అనుమతి లేకుండా ప్లాట్లు వేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న భూముల్లోకి రైతులు వెళ్లే వీల్లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లోకి నీరు పారుదల కాకుండా కాలువను పూడ్చివేశారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముగ్గురు వ్యక్తులు రైతులను బెదిరించి భయాందోళనలకు గురిచేశారని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి

అవనిగడ్డ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ న్యాయవాదులు, పోలీసుశాఖకు సూచించారు. మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ జరుగనున్న నేపథ్యంలో లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు ఒనగూరే ప్రయోజనాలు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజీ పడదగ్గ కేసుల్లో పట్టుదలకు పోకుండా మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.



లొల్లా కుటుంబ శాస్త్రిని సత్కరిస్తున్న అర్చకులు, పురోహితులు

ప్రభుత్వం దృష్టికి పురోహితుల సమస్యలు

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అర్చకులు, పురోహితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ అర్చక, పురోహిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు లొల్లా కుటుంబ శాస్త్రి అన్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గాయత్రీ బ్రాహ్మణ పురోహిత సేవా సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. కుటుంబ శాస్త్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేదపండితులకు రూ. 3 వేల భృతి అందిస్తున్నారని, అర్హులైన అర్చకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల నియామకం జరుగుతుందన్నారు. గాయత్రీ బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు లక్కావజుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రెండుచింతల సూర్యనారాయణ శర్మ, తంగిరాల కుమార్ శర్మ, రాము, చిత్రపు లీలాప్రసాద్, జొన్నలగడ్డ శ్రీనివాస్, పిల్లలమర్రి శ్రీను, మన్నవ రామకృష్ణ, కృత్తివెన్ను ప్రసాద్, జొన్నలగడ్డ సాయి, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం



రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉల్లిపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కంటి చూపు, వినికిడిశక్తిని కోల్పోయిన చిల్లా పాండు రంగారావుకు మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. పాండురంగారావు ఇటీవల తండ్రిని కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాండురంగారావు సమస్యలను మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి దృష్టికి తీసుకువెళతామని బండి రామకృష్ణ అన్నారు. నాయకులు బండి శివ, వేముల వెంకటేశ్వరరావు, తోట రాజేష్, శ్రీపతి చంద్రం, పెన్నేరు సుబ్రహ్మణ్యం, వీర్నాల వీరబాబు, తిరుమలరావు, సమ్మెట బాబు, బండి చంటి, కటికల సుబ్బారావు, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

మోపిదేవి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగాయితిప్ప, మోపిదేవిలంక గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నగదు చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్థులు ఎంపీడీవో స్వర్ణభారతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాగాయితిప్ప శివారు పోచిగానిలంక గ్రామానికి చెందిన ఉప్పల బాబురావు పొలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొబ్బరి మొక్కలు నాటి సాగు చేయటం జరిగింది. ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సిన నగదును వేరొకరి ఖాతాలకు సిబ్బంది చెల్లించినట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. ఉప్పాల ఏసు, బల్లా సీతారామ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెడన, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. పెడన మునిసిపల్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ - నీటి వనరులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ, పీల్చేగాలి, తాగేనీరు స్వచ్ఛమైనవి కానప్పుడు ప్రజలు అనారోగ్యం బారిన పడతారని ఆయన హెచ్చరించారు. మునిసిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం కింద స్పెషల్ డ్రైవ్ చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. న్యాయవాదులు అజ్మతున్నీసా, షంషద్‌బేగ్, టిపిఓ సుజనకుమారి, ఏఈ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద సముద్రపు పోటుకు భారీగా వస్తున్న ఉప్పునీరు



ఉప్పునీటితో నిండి చౌడు బారుతున్న సాగు భూములు

అడుగుపడని అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణం

● రైతుగోడు పట్టని గత పాలకులు ● కూటమి ప్రభుత్వం దయ చూపాలని రైతుల వేడికోలు

ఆంధ్రజ్యోతి-కోడూరు : శిథిలావస్థకు చేరిన పాలకాయితిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా పంట వేసుకునే పరిస్థితి లేక, వేసుకున్న పంట చేతికి రాక అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి నా బార్డు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామంటూ గత వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఐనా అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు చేపడతారని భావించిన అన్నదాతల ఆశలు అడియాశగానే కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ పూర్తయి నెల రోజులు అవుతున్నా గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి అంచనాలు రూపొందించి నా బార్డు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పటం విడ్డూరంగా ఉంది. కనీస రక్షణ చర్యల్లో భాగమైన సముద్రపు నీరు పంట పొలాల్లోకి చేరకుండా అవుట్ ఫాల్స్ వద్ద ఇసుక మూటలు కూడా అధికారులు వేయటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అనేక మార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ అసలు పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. సాగు భూమిలోకి ఉప్పునీరు చేరి చౌడుభూమిగా మారుతోందని, ఆ భూమి మరలా సాగులోకి రావాలంటే రైతులు ఎంత కష్టపడాలో, వారి కష్టం విలువ అధికారులకుఅర్థం కావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతల ఆవేదన అర్థం చేసుకొని వెంటనే అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనీస రక్షణ చర్యలు లేవు



అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం కనీస రక్షణ చర్యలు కూడా చేపట్టడం లేదు. అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి నిధులు కావాలంటున్నారు. కనీసం ఇసుక మూటలు వేయటానికి కూడా నిధులు ఎక్కడి నుంచి రావాలో మరి!

- పడమటి దుర్గారావు, కోడూరు

ఏఈ కరీమ్ వివరణ

ఈ విషయమై ఏఈ కరీమ్‌ని వివరణ కోరగా, అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆనందపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. నిజాంపేటకు చెందిన యువకుడు షేక్ పవన్ బైక్‌తో ఢీకొట్టడంతో చందనపు రంగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్వి చక్ర వాహనాన్ని విడిచి వాహనదారుడు పరారీ అయ్యాడు. చిలకలపూడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి రెండేళ్ల జైలు

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అత్యాచారయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.8వేల జరిమానా విధిస్తూ తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి సుజాత తీర్పు చెప్పారు. 2022 అక్టోబరు 21న బందరు కోటకు చెందిన మహిళపై మన్నె మురళి అత్యాచార యత్నం చేశాడు. ఎస్సై ఎండి మస్తాన్ ఖాన్ కేసు నమోదు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 12 మంది సాక్షులను విచారించారు. నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి సుజాత తీర్పు ఇచ్చారు.

పశువుల్లో వ్యాధులను గుర్తించాలి

పెడన రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాకర్లమూడిలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. వ్యాధులను సకాలంలో గుర్తించకుంటే పశువులకు నష్టం జరుగుతుందని డాక్టర్ యం.అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. అధిక పాల తిగుబడి కోసం పలు సూచనలు చేశారు. పశువులు, గొర్రెలు, కోళ్లకు వైద్య సేవలు అందించారు. సూరిబాబు, రాజేశ్వరరావు, కోటేశ్వరరవు, ఆలియాతస్లీమ్, బాలాజీ రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో నేరాల నియంత్రణ



చల్లపల్లి ఆటోనగర్ కాలనీలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, చిత్రంలో సీఐ, ఎస్సైలు

చల్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ టెక్నాలజీ సాయంతో నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తెలిపారు. అవనిగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో తొలిసారిగా చల్లపల్లిలో డ్రోన్ టెస్టింగ్ చేపట్టి డ్రోన్ వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటోనగర్ సమీపంలోని కొత్తకాలనీలో డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును గమనించారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో మాట్లాడారు. డ్రోన్‌ల ద్వారా నేరాలను, జూదాలను నియంత్రించవచ్చన్నారు. నేరాలు జరిగిన సమయంలో నిందితులను గుర్తించేందుకు డ్రోన్ ఉపయోగ పడుతుందన్నారు. డ్రోన్‌లో కెమేరాలు ఏర్పాటు చేసి వీడియో రికార్డింగ్ సైతం అమర్చటం వల్ల నిందితులు పారిపోయినా ఫొటోలు, వీడియో ద్వారా గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రోన్ పనితీరుచూసి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చి అసాంఘిక కార్యక్రమాలు, నేరాల నియంత్రణకు ఉపయోగిస్తామని వివరించారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు తెలియచేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఏయే తరహాల్లో మోసాలు చేస్తారో సవివరంగా తెలియచేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై బందరులో పోలీసుల బైక్ ర్యాలీ

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని ట్రాఫిక్ డీఎస్పీ శివకుమార్ అన్నారు. మంగళవారం కోనేరుసెంటర్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ట్రాఫిక్ డీఎస్పీ శివకుమార్, చిలకలపూడి సీఐ నబి మెగా ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోతే వచ్చే ప్రమాదాలను వివరించారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ వెంకటనారాయణ, రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

పృథ్వీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

చల్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వంశపారంపర్య అర్చకులు కంఠంరాజు సాయిబాబు శర్మ (గణపతి దీక్షాతులు), దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యార్లగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నడకుదురులోని పృథ్వీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా హనుమాన్‌చాలీసా పారాయణ, శోభాయాత్ర



శోభాయాత్ర చేసి హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

అవనిగడ్డ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనారాయణ స్వామిఆలయ ప్రాంగణంలో దాదాపు 104 రోజులుగా హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాలు వైభవంగా జరుగుతున్నాయి. హనుమాన్ చాలీ సా పారాయణంతోపాటు శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. జనవరి 31వ తేదీన 108 రోజుల చాలీసా పారాయణ మహా యజ్ఞం ముగుస్తుందని, లక్షా 8 వేల తమలపాకుల పూజ నిర్వహించి అన్నసమారాధన నిర్వహి స్తామని భక్తబృందం తెలిపింది. చిట్టా ప్రసా ద్, అన్నపరెడ్డి హిమగిరి పర్యవేక్షిస్తున్నారు. హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని పెదముత్తేవి ఆశ్రమ పీఠాధిపతి గొర్తా కృష్ణస్వామిజీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతా మందిరంలో స్వామిజీని నూతన వస్త్రాలతో మందిరం కమిటీ చైర్మన్ శ్రీహరిబాబు సత్కరించారు. అర్చక స్వాములు నరసింహమూర్తి, రఘు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



డీఈఈ సురేష్ బాబుకు ఘన సన్మానం

చల్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ డీఈఈగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబుకు చల్లపల్లి పంచాతీయ రాజ్ ఏఈఈ బొప్పన శ్రీనివాసు ఆధ్వర్యంలో మంగళవారం ఘనసన్మానం జరిగింది. సురేష్‌బాబును సత్కరించి అభినందనలు తెలిపారు. సచివాలయాల ఇంజనీరింగ్ కార్యదర్శులు సిహెచ్.గోపి, డి.నాగ వెంకట వంశీ కృష్ణ, టి.కార్తీక్, కె.రవి అంకినీడు ప్రసాద్, ఎం.సాంబశివరావు, సిహెచ్.వీర వెంకట మణికంఠ, ఏ.భాస్కర్, పి.వింధ్యారాణి, ఎస్.పుష్పశ్రీ, కె.సతీష్ బాబు, పి.నాగ సురేష్ కుమార్, టి.భాను కృష్ణప్రియ, కె.దయా కిరణ్ పాల్గొన్నారు.

మల్లవోలు పాఠశాల తనిఖీ

గూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌ను సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఫణిధూర్జటి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎంసీ నిధులు ఎందుకు ఖర్చు పెట్టలేదో హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు కాసాని అరుణకు పలు సూచనలు చేశారు.

గూడూరు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని జనసేన నేతల వినతి

గూడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గూడూరులో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలనిఎంపీ వల్లభనేని బాలశౌరిని మంగళవారం గూడూరు జనసేన నాయకులు కోరారు. గూడూరులో డ్రైనేజీ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకువెళ్ళారు. మాజీ సర్పంచ్ పోతన రామోజీ, దాసరి ఉమాసాయిరామ్, బాసంశెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గారావు ఎంపీని కలసిన వారిలో ఉన్నారు.

పెనుమల్లి జడ్పీ పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



పెడన రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పెనుమల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు జెరాక్స్ మిషన్‌తోపాటు 1,01,116 నగదును డిపాజిట్ వేసి పత్రాలను ప్రధానోపాధ్యాయురాలు జి.వి.విజయకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ కాట్రగడ్డ నాగరాజులకు అందించారు. డిపాజిట్‌పై ప్రతి ఏటా వచ్చే వడ్డీతో పదవతరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించాలని కోరారు. డెంటల్ వైద్యులు కె బ్రహ్మరావు, యం.కిషోర్, శేషు, రమణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఘంటసాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మినుము పంట సాగు చేసే రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాఅలని మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. వేములపల్లి, చిట్టూర్పు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. లద్దె పురుగు, మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ లేదా క్లోరాంత్రనిల్‌ప్రోల్ మందును వేపనూనెతోపాటు పిచికారి చేసుకోవాల న్నారు. చిట్టూర్పు సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, వేములపల్లి పంచాయతీ కార్యదర్శి ఆర్.సురేష్, విఏఏలు జి.రవిచంద్ర, బి.పూజిత, రైతులు సూర్యదేవర రామకృష్ణ పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో పశు వైద్యశిబిరం

మోపిదేవి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బొబ్బర్లంక గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, వైద్యులు నందకిషోర్ శిబిరాన్ని ప్రారంభించి పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామస్థులు దొప్పలపూడి జగదీష్, రావి రత్నగిరి, పశుసంవర్థక శాఖ సహాయక ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణం

అవనిగడ్డ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అశ్వారావుపాలెంలో సీసీ రహదారి పనులకు జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా మంగళవారం శంకుస్థాపన చేశారు. వార్డు సభ్యురాలు నాగలక్ష్మి, పీఆర్ ఏఈ బ్రహ్మానందబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480



పాలిటెక్నిక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఐ సోమేశ్వరరావు

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గుడ్లవల్లేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించడంతోపాటు తండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా రాణించాలని గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. ఎల్.ఆర్. సోమేశ్వరరావు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, వాటి నుంచి భద్రత, మద్యం, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.వి.వి. సత్యనారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వృత్తి విద్యా కోర్సులకు మంచి భవిష్యత్

కూచిపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యా కోర్సుల ద్వారా సాంకేతిక అంశాల్లో పరిజ్ఞానం పెంపొంది విద్యార్థులకు మంచి భవిష్యత్ కలుగుతుందని మొవ్వ జడ్పీ పాఠశాల హెచ్‌ఎం పి.శివకోటేశ్వరరావు అన్నారు. మొవ్వ సచివాలయం-1 పరిధిలో 9,10 తరగతుల వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు 60 మంది మంగళవారం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీఆర్‌సీ ఆధ్వర్యంలో సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ మహేష్, డిజిటల్ అసిస్టెంట్ నవీన్‌ల వద్ద సాంకేతిక పరమైన అంశాల్లో శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న మండల అధికారులు

ఉత్తమ అధికారులకు అభినందన

నందివాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డికె.బాలాజీ నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్న నందివాడ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పి.మల్లేశ్వరి, సీనియర్ సహాయకులు సి.హెచ్.శ్రీనివాసరావులను నందివాడ మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. అదేవిధంగా మండలంలో ఉత్తమ సేవలందించిన నందివాడ పంచాయతీ కార్యదర్శి కె.సురేష్‌బాబు, పెదవిరివాడ పంచాయతీ కార్యదర్శి ఉషారాణికి మండల ఉత్తమ అవార్డులు మండల ఎంపీపీ పెయ్యేల ఆదామం, మండల పరిపాలన అధికారి కె.కోటేశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి ఎం.అమీర్ బాషా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెయ్యేల ఆదాము ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ల రీవెరిఫికేషన్ ప్రారంభం

గుడివాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ఏరియా ప్రభుత్వాసుపత్రిలో దివ్యాంగుల పెన్షన్‌ల రీవెరిఫికేషన్ ప్రారంభమైంది. తొలిరోజు నేత్రలోపం ఉన్న పెన్షన్‌దారులకు పరీక్షలు నిర్వహించారు. వైకల్యం లేకుండా పెన్షన్‌లు పొందుతున్నట్లు వచ్చిన ఆరోపణలతో రాష్ట్ర వ్యాప్తంగా రీ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

గన్నవరం బాలోత్సవం 1న

గన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గన్నవరం బాలోత్సవం తృతీయ పిల్లల పండుగ ఫిబ్రవరి 1న స్థానిక జిల్లా పరిషత్ బాలి కోన్నత పాఠశాల ఆవరణలో జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఈ మేరకు బాలికల హైస్కూల్‌లో గన్నవరం బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, గన్నవరంతో పాటు ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి కూడా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులు 23 విద్య సం బంధమైన, పది సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఎంట్రీ ఫారాలు సమర్పించేందుకు బుధవారం సాయంత్రం వరకూ అవకాశం ఉందని తెలిపారు. బాలోత్సవం అధ్యక్షుడు గన్నె వెంకట్రావు ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, హెచ్‌ఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు పశు వైద్యశిబిరంలో పాడిరైతులకు మందులు అందజేస్తున్న సంత కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు చౌదరి

గుడ్లవల్లేరులో పశువైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేయడం అభినందనీయమని నెహ్రూ పశువుల సంత అండ్ గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి అన్నారు. గుడ్లవల్లేరులో పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 50 గేదెలు, 300 గొర్రెలు,1 00 మేకలకు వైద్యపరీక్షలు చేశారు. ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, సి.శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

చౌటపల్లి అంగన్వాడీలో ఆధార్ నమోదు

గుడివాడ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ చేస్తున్నారు. చౌటపల్లిలోని మూడు కేంద్రాల్లో 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ నమోదు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


అంగన్వాడీలో ఆధార్ నమోదు చేయుస్తున్న కార్యకర్తలు, ఆయాలు

కూటమి పాలనలో గ్రామాలకు మహర్దశ

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా


కపిలేశ్వరపురంలో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ. 36 లక్షలతో కపిలేశ్వరపురంలో నిర్మించిన ఏడు సీసీ రోడ్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు.గ్రామపం చాయతీలకు మంజూరైన నిధులు పక్కదారి పట్టించి వైసీపీ నాయకులు దోచుకుతిన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, సాయిదత్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.




మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో పీఎం సూర్యఘర్‌పై జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి.. సింగలూరులో సూర్యఘర్ పథకంపై గ్రామస్తులకు వివరిస్తున్న ఈఈ జి.బి శ్రీనివాసు

సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి

కూచిపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే పీఎం సూర్యఘర్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో జె.విమాదేవి సిబ్బందికి సూచించారు. మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, వెలుగు, ఏఎన్ఆర్ ఈజీఎస్, విద్యుత్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సబ్సిడీపై అందజేసే సోలార్ విద్యుత్ పథకం వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ నెలకు 125 యూనిట్లు ఉత్పత్తి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించే రాయితీ, సోలార్ విద్యుత్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈవోపీఆర్డీ కె.పరమాత్మ, సూర్యఘర్ ప్రతినిధి సుధాకర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కె.వి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : సూర్యఘర్ పథకం ద్వారా ఆదాయాన్ని కూడా పొందవచ్చుని విద్యుత్ శాఖ ఈఈ జి.బి.శ్రీనివస్ అన్నారు. సింగలూరు గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డిప్యూటీ ఈఈ పి.కిరణ్ బాబు, ఏఈ ఎస్.వరకుమార్, ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటక కళా వైభవానికి ప్రతీక పామర్తి

గుడివాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : నాటక రంగంలో గుడివాడ ఖ్యాతిని నలుదిశలా చాటిన క్రమశిక్షణగల కళాకారుడు పామర్తి సుబ్బారావు అని, ఆయన గుడివాడ నాటక కళా వైభవానికి ప్రతీక అని పలువురు కొనియాడారు. కైకాల కళా మందిరంలో పామర్తి సుబ్బారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పామర్తి కాంస్య విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంతరం పామర్తి కుటుంబీకులు ఝాన్సీ సేవా అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.


పామర్తి కుటుంబ సభ్యులకు ఝాన్సీ సేవా అవార్డులు అందజేస్తున్న కళాకారులు


గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థిని గాయత్రిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విద్యార్థిని గాయత్రికి ఘన సత్కారం

గుడ్లవల్లేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్స్-2025లో ఎస్ఆర్‌జీఈసీ విద్యార్థిని మట్లపూడి గాయత్రి తన ప్రతిభ చాటుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. జాతీయ వేదికపై టెక్ ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై తన ఆలోచనలను ప్రధాని నరేంద్ర మోదీకి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కరుణకుమార్ అభినందించారు. 3000 మందిలో తమ విద్యార్థిని ఒకరు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గాయత్రిని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సత్కరించి జ్ఞాపికను అందజేశారన్నారు. మంగళవారం గాయత్రిని కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, ఐటీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ డి.ఎన్.వి.ఎస్.ఎల్.ఇందిర అభినందించారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన వివిధ పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థులు లఘునాటిక విభాగంలో బి.నితిక బృందం ప్రథమ స్థానం, చిత్రలేఖనం విభాగంలో జి.పార్థీవని జానకి తృతీయ, పాటల విభాగంలో జి.వి.వైశాలి తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వి.లక్ష్మి తెలిపారు. పతకాలను సాధించిన పాఠశాల కరస్పాండెంట్ పి.వి.వి. రమాదుర్గ, ప్రధానోపాధ్యాయులు జి.పద్మావతి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

వానపాముల వద్ద ఆటో బోల్తా



పెదపారుపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం సర్కస్ సామగ్రితో వెళుతున్న వాహనం వానపా ముల పెద్ద వంతెన వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో గాయపడిన వారిని స్థానిక హాస్పటల్‌కు తరలించారు. అదే ప్రదేశంలో ఆర్టీసీ బస్సు కూడా ప్రమాదానికి గురైంది. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం రోడ్డు మరమ్మతులు మాత్రం చేయటం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర సస్యరక్షణతో మినుములో మేలైన దిగుబడులు

గుడివాడ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మినుము పైరుపై తెల్ల మచ్చ తెగులు సోకుతున్నందున సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. బిళ్లపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచు ఉన్నందున పొలాల్లో మినుము పైరుపై వివిధ రకాల తెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎటువంటి సూచనలు, సలహాలు కావాలన్నా అందిస్తామని తెలిపారు. మినుము పైరు పూత, పిందె దశలో ఉన్నందున పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో బోలెం అనంతలక్ష్మి, మండల విస్తరణాధికారిణి దేవనబోయిన అనిత, సిబ్బంది పాల్గొన్నారు.


పామర్రు పొలంబడిలో మినుము పైరుపై ఆశించే తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఏడీఏ స్వర్ణలత



బిళ్లపాడులో మాట్లాడుతున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

పామర్రు : మినుము పంటను ఆశించే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలతో చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని పామర్రు వ్యవసాయ సహాయ సంచాలకురాలు బి.స్వర్ణలత అన్నారు. పామర్రు, జుజ్జువరం గ్రామాల్లో మంగళవారం పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి వి.శివనాగరాణి, వీఏఏలు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో నేరాల నియంత్రణ


చల్లపల్లి ఆటోనగర్ కాలనీలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, చిత్రంలో సీఐ, ఎస్సైలు

చల్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ టెక్నాలజీ సాయంతో నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తెలిపారు. అవనిగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో తొలిసారిగా చల్లపల్లిలో డ్రోన్ టెస్టింగ్ చేపట్టి డ్రోన్ వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటోనగర్ సమీపంలోని కొత్తకాలనీలో డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును గమనించారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో మాట్లాడారు. డ్రోన్‌ల ద్వారా నేరాలను, జూదాలను నియంత్రించవచ్చన్నారు. నేరాలు జరిగిన సమయంలో నిందితులను గుర్తించేందుకు డ్రోన్ ఉపయోగ పడుతుందన్నారు. డ్రోన్‌లో కెమేరాలు ఏర్పాటు చేసి వీడియో రికార్డింగ్ సైతం అమర్చటం వల్ల నిందితులు పారిపోయినా ఫొటోలు, వీడియో ద్వారా గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రోన్ పనితీరుచూసి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వీటిని అం దుబాటులోకి తీసుకువచ్చి అసాంఘిక కార్యక్రమాలు, నేరాల నియంత్రణకు ఉపయోగిస్తామని వివరించారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు తెలియచేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఏయే తరహాల్లో మోసాలు చేస్తారో సవివరంగా తెలియచేశారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై బందరులో పోలీసుల బైక్ ర్యాలీ

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని ట్రాఫిక్ డీఎస్పీ శివకుమార్ అన్నారు. మంగళవారం కోనేరుసెంటర్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ట్రాఫిక్ డీఎస్పీ శివకుమార్, చిలకలపూడి సీఐ నబి మెగా ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోతే వచ్చే ప్రమాదాలను వివరించారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ వెంకటనారాయణ, రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

పెనమలూరు : రహదారులపై సురక్షితంగా ప్రయాణిస్తూ గమ్యాన్ని చేరడమే నిజమైన నేస్తమని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తాడిగడప సెంటరులో బందరు రోడ్డుపై జరిగిన హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాముఖ్యత అవగాహన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు.